# రయ్.. రయ్

అనకాపల్లి-సబ్బవరం-పెందుర్తి రహదారి(పాత బైపాస్)పై నిత్యం వేలాది వాహనాల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగిస్తున్నాం'పినగాడికి చెందిన ఆటో డ్రైవర్ రమేష్ సంతోషం.

పెందుర్తి కూడలి నుంచి ఆనందపురం వైపు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఓ వైపు వాహనాల రద్దీ.. మరోవైపు ఇరుకు రోడ్డు.. గుంతలు. ఇలా చాలా అవస్థలు పడేవాళ్లం. అయితే ఏడాది క్రితం మా సమస్యను సీఎం వైఎస్ జగన్ తెలుసుకుని వెంటనే రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేశారు. ఇప్పుడు రోడ్డు వెడల్పు అయ్యి చాలా సౌకర్యవంతంగా ప్రయాణం చేస్తున్నాం'పెందుర్తికి చెందిన ప్రవీణ్ ఆనందం ఇది.

- పాత బైపాస్ సిద్ధం
- రూ.11.84 కోట్లతో పెందుర్తి-సబ్బవరం-అనకాపల్లి రోడ్డు అభివృద్ధి
- వాహనాల రాకపోకలకు మార్గం సుగమం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం


నాడు: సాధుమఠం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు (ఇన్‌సెట్)
నేడు: సాధుమఠం మరమ్మతులు చేపట్టిన రహదారి

పెందుర్తి: రహదారుల నిర్మాణం, మరమ్మతులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెందుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రధాన రహదారుల నిర్మాణం/మరమ్మతులు చాలా వరకు పూర్తయ్యాయి. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరిన పెందుర్తి-సబ్బవరం-అనకాపల్లి రోడ్డు అత్యంత సుందరంగా మార్చింది. దీర్ఘకాలంగా ఉన్న ఈ రోడ్ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చొరవ తీసుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఈ రోడ్డు దుస్థితిని నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. దీంతో రూ.11.84 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు మరమ్మతు పనులు మూడు నెలల క్రితం పూర్తి చేశారు. ఇప్పుడు ఈ రోడ్డులో ప్రజలు హాయిగా ప్రయాణం సాగిస్తున్నారు.

**చాలా ఉపయోగం :** అనకాపల్లి-ఆనందపురం బైపాస్ పూర్తి స్థాయి రహదారి నిర్మాణం జరుగుతుండడంతో పెందుర్తి-సబ్బవరం-అనకాపల్లి(పాత బైపాస్) రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. దీనికి వర్షాలు కూడా తోడవడంతో రోడ్డు పూర్తిగా పాడైంది. దీంతో అనకాపల్లి జిల్లా నుంచి సబ్బవరం మీదుగా నగరానికి వెళ్లే వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడేవారు. దీనిపై స్థానికుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ప్రభుత్వం మరమ్మతులకు నిధుల మంజూరుకు చొరవతీసుకోవడంతో రోడ్డు పూర్తిస్థాయిలో బాగుపడింది. దీంతో నాలుగైదు మండలాల ప్రజల రాకపోకలకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా మారింది.





నాడు: అక్కిరెడ్డిపాలెం వద్ద అధ్వానంగా రోడ్డు (ఇన్‌సెట్)
నేడు: అక్కిరెడ్డిపాలెం వద్ద విశాలంగా రోడ్డు


నాడు: పెందుర్తి-సబ్బవరం రోడ్డు దుస్థితి (ఇన్‌సెట్)
నేడు: సుందరంగా మారిన పెందుర్తి-సబ్బవరం రోడ్డు

## క్లుప్తంగా

### అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని సీతమ్మధారకు చెందిన ఎం.విమల అనేదాత రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్ అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

### త్రివిక్రముడి అలంకరణలో అప్పన్న దర్శనం


త్రివిక్రమాలంకారంలో అప్పన్నకు మాడ వీధుల్లో తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు గురువారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి త్రివిక్రమాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని త్రివిక్రముడిగా అలంకరించి, శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకిలో ఉంచి సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ వేడుక నిర్వహించారు.

### వెంకటాద్రిపై ఘనంగా ధనుర్మాసోత్సవాలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావై 12వ పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

### గోదాదేవికి విశేషంగా పూజలు


విశేష అలంకరణలో గోదాదేవి అమ్మవారు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం కొండదిగువ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం గోదాదేవికి విశేషంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి వేదికపై వేంజేపచేశారు. తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. పాశుర విన్నపాన్ని పఠించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులు అమ్మవారిని, స్వామిని దర్శించుకున్నారు. అర్చకుడు కె.కె.భార్గవ్ పూజలు చేశారు.

## అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేస్తున్న అర్చకుడు


స్వామికి గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు చక్రపాణి, శ్రీకాంత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటలకు నిత్య కల్యాణం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.
- అప్పన్న స్వామికి గరుడసేవ వేడుకగా సాగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలో గరుడ వాహనంపై అధిష్టింపజేసి అష్టోత్త శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించి, విశేషంగా హారతులు అందజేశారు.

## యోగా విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఎన్టీపీసీ జీజీఎం ఎస్‌కే సిన్హా

పరవాడ: జాతీయ స్థాయి యోగా పోటీల్లో సత్తా చాటిన పరవాడ మండల విద్యార్థులను ఎన్టీపీసీ జీజీఎం ఎస్.కె.సిన్హా అభినందించారు. కోల్‌కతా, అగర్తలా, పంజాబ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎన్టీపీసీ లోగోతో కూడిన ట్రాక్స్ సూట్స్‌ను బహూకరించారు. వీరంతా గతంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా తరగతుల్లో శిక్షణ పొందారు. కార్యక్రమంలో హెడ్ ఆఫీస్ హెచ్ఆర్ పాత్రో, సీఎస్సార్ సీనియర్ మేనేజర్ ప్రకాశరావు, యోగా శిక్షకుడు సీహెచ్.ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


వాలిమెరక జుత్తాడలో క్రీడాకారులతో వైఎస్సార్‌సీపీ నేత బొడ్డు సూర్యప్రకాష్

పెందుర్తి: యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు మూడో రోజు గురువారం నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగాయి. జీవీఎంసీ 95వ వార్డులోని పలు ప్రాంతాల్లో క్రీడా పోటీలను కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. క్రీడాకారులను ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడలో వైఎస్సార్‌సీపీ నేత బొడ్డు సూర్యప్రకాష్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పినగాడిలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడాకారులను పెదగాడి సర్పంచ్ కేసుబోయిన లావణ్య పరిచయం చేసుకుని ప్రోత్సహించారు. పినగాడి, జుత్తాడ మైదానాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో హోరాహోరిగా తలపడ్డారు.

## శరవేగంగా తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్ పనులు


పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక షాపులు

సింహాచలం: సింహగిరిపై తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రసాద్ స్కీమ్ పథకంలో భాగంగా సింహగిరిపై కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. దీంతో ప్రసుత్తం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ని ఇటీవల దేవస్థానం అధికారులు తొలగించారు. కొత్త షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి వచ్చే వరకు ప్రత్యామ్నాయంగా తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్‌ని పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల సముదాయంలో దేవస్థానం అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు వారం రోజుల నుంచి సాగుతున్నాయి. మొత్తం 64 దుకాణాలను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే జనవరి 3వ తేదీ నుంచి విజయవాడ కనకదుర్గ దేవస్థానంలో ప్రారంభమయ్యే చండీ సందర్భంగా సింహగిరికి కూడా అధిక సంఖ్యలో దీక్షాధారులు వస్తారు. అలాగే శబరిమలైలో జ్యోతికి వెళ్లే అయ్యప్ప భక్తులు కూడా సింహగిరికి అధిక సంఖ్యలో రానున్నారు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని త్వరగా షాపులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు దేవస్థానం అధికారులు ప్రయత్నిస్తున్నారు. తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తికి, ఇంజినీరింగ్ అధికారులకు సింహగిరి వర్తకుల సంఘం అధ్యక్షుడు ముగ్గ కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

## చెరువు గర్భంలో ఆక్రమణల తొలగింపు


చెరువును పరిశీలిస్తున్న ఆర్ఐ వీరయ్య తదితరులు


అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

సబ్బవరం: మండలంలోని ఎరుకునాయుడుపాలెం గ్రామంలో చెరువు గర్భం ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ సిబ్బంది గుర్తించి తొలిగించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామంలోని సర్వే నంబర్ 87లో 11.80 ఎకరాల్లో బూరుగుల చెరువు ఉందేదని ఆర్ఐ వీరయ్య తెలిపారు. చెరువు ఆక్రమణకు గురైనట్లు స్పందనలో కొందరు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు గురువారం పరిశీలించామన్నారు. మొల్లి ముత్యాలు అనే వ్యక్తి పౌల్ట్రీ షెడ్‌ను చెరువు గర్భంలోని ఒక సెంటు స్థలం ఆక్రమించి నిర్మించినట్లు గుర్తించామని, అదే విధంగా మరో రైతు 20 సెంట్లు చెరువు గర్భం ఆక్రమించినట్లు గుర్తించామని తెలిపారు. ఆక్రమణలను జేసీబీ సాయంతో తొలగించారు. ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణ, వీఆర్వో విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన


ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు కనకలక్ష్మి

సబ్బవరం: అమృతపురం గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.కనకలక్ష్మి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు గురువారం సందర్శించారు. గ్రామంలో ఐసీఆర్‌పీఎస్(ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్)లు వేసిన ఏటీఎం మోడల్ క్షేత్రాలను పరిశీలించారు. సుమారు 20 సెంట్ల విస్తీర్ణంలో ఏటీఎం మోడల్స్ ద్వారా నెలకు రూ.10 వేలు చొప్పున నిరంతరం ఆదాయం పొందవచ్చని కనకలక్ష్మి తెలిపారు. కూరగాయలను ఈ విధానంలో సాగుచేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. అడిషనల్ డీపీఎం ఆర్.వి.స్వామినాయుడు, డివిజన్ ఇన్‌చార్జి ఎం.వెంకటలక్ష్మి, సమాఖ్య కార్యదర్శి జి.శ్యామల, కోశాధికారి లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## లాకర్స్ సద్వినియోగం చేసుకోవాలి


పీఏసీఎస్‌లో లాకర్లు ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు తదితరులు

సబ్బవరం : సబ్బవరంలోని శ్రీదుర్గమాంబ కో ఆపరేటివ్ బ్యాంకులో నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన లాకర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు కోరారు. కో ఆపరేటివ్ బ్యాంకులో నూతనంగా ఏర్పాటు చేసిన లాకర్స్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. బ్యాంకులో లాకర్స్ కావాల్సిన వారు అడ్వాన్స్ చెల్లించి తీసుకోవచ్చని, అద్దె చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ, ఏపీ సీవోబీ ఏజీఎం రాజు, డీసీసీబీ జీఎం అప్పలరాజు, పెందుర్తి బ్రాంచి మేనేజర్ విద్యామాల, పాలకవర్గ సభ్యులు పల్ల కృష్ణ, బి.మంజుల, సొసైటీ సీఈవో గొంప రమణ, సూపర్‌వైజర్ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సంతపేటలో రక్తదానం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలాపు సురేష్ రెడ్డి గురువారం సంతపేట చిల్డ్రన్స్ పార్కులో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.

## కంచర్ల చిత్ర యూనిట్ సందడి


మాట్లాడుతున్న నిర్మాత కంచర్ల అచ్యుతరావు


షూటింగ్ సన్నివేశాలు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి గ్రామంలో కంచర్ల సినిమా యూనిట్ గురువారం సందడి చేసింది. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ బ్యానర్‌లో తెరకెక్కనున్న ఈ సినిమాలో హీరోగా కంచర్ల ఉపేంద్ర, హీరోయిన్‌గా మీనాక్షి జయస్వాల్ నటిస్తున్నట్టు నిర్మాత డాక్టర్ అచ్యుతరావు తెలిపారు. ఆర్.యాదకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అజయ్ గోశల్, కాశీ విశ్వనాథం వంటి నటులు నటిస్తున్నారన్నారు. ఇది ఈ సినిమాకు చివరి షెడ్యూల్ అని, సంక్రాంతి తరువాత రిలేజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. తమ బ్యానర్‌లో వరుసగా 6 సినిమాలు రన్నింగ్‌లో ఉండగా.. ఇప్పటికే 5వ సినిమా ఉపేంద్రగాడి అడ్డా రిలేజ్ కావడంతో మంచి టాక్ వచ్చిందన్నారు. తమకు ఈ బ్యానర్‌తో పాటు ఉపకార చారిటబుల్ ట్రస్ట్ ఉందని, దీని ద్వారా గత 22 సంవత్సరాలుగా అనేక సేవలు అందిస్తున్నామన్నారు. ఈ సినిమాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని చారిటబుల్ ట్రస్ట్‌కు ఉపయోగిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ఆటో డ్రైవర్ నిజాయితీ


రమ్యకు డబ్బులు అందిస్తున్న డీసీపీ వెంకటరత్నం

ఆరిలోవ: ఆటోలో మరిచిపోయిన బ్యాగును బాధిత మహిళకు అందజేసి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. ఆరిలోవ క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 25న విమ్స్ ఆస్పత్రి వద్ద జి.రమ్య, తల్లిదండ్రులతో కలిసి ఆటో ఎక్కి ఆరిలోవలో బాలాజీనగర్ వద్ద దిగారు. ఆ సమయంలో తమ వెంట తీసుకొచ్చిన రూ.45 వేలు నగదుతో ఉన్న బ్యాగును ఆటో మరిచిపోయి దిగిపోయారు. ఇంటికి వెళ్లిన అనంతరం చూసేసరికి డబ్బులు ఉండే బ్యాగు కనిపించకపోవడంతో వెంటనే ఆరిలోవ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలాజీనగర్ వద్ద ఉన్న 25వ తేదీకి సంబంధించిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆటోను గుర్తించారు. టీవీసీ పాయింట్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కే మస్తాన్ నిజాయితీగా ఆటోలో తనకు దొరికిన రూ.45 వేలు నగదును తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో గురువారం క్రైం డీసీపీ పి.వెంకటరత్నం బాధితురాలు రమ్యను పిలిపించి నగదు అందజేశారు. నిజాయితీగా వ్యవహరించిన మస్తాన్‌ను అభినందించి, ఆరిలోవ క్రైం పోలీసులకు బాధిత మహిళ కృతజ్ఞతలు తెలిపారు. ద్వారకా క్రైం సీఐ ఇమాన్యుయేల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## పద్య సాహిత్యం అవసరం


మాట్లాడుతున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

సీతంపేట: ప్రసన్నభారతి ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సాహిత్య సభ జరిగింది. ప్రసన్నభారతి అధ్యక్షుడు ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజాంకు చెందిన గార రంగనాథం రచించిన 'రాయరత్న మంజూష' విమర్శ గ్రంథానికి, పాల్వంచకు చెందిన అచ్యుతానంద బ్రహ్మచారి రచించిన 'సాందీపని చరిత్ర' పద్యకావ్యానికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ భావితరాలకు తెలుగు భాష సంప్రదాయ సాహిత్యాన్ని, విలువలను అందజేస్తున్న ప్రసన్నభారతి కృషిని ప్రస్తావించారు. రచయితలు డి.వి.సూర్యారావు, బులుసు వెంకటేశ్వర్లు, ప్రసన్న భారతి కార్యదర్శి సర్వేశ్వర ప్రసాద్ పద్య సాహిత్యం వైభవాన్ని, పద్య సాహిత్యాన్ని నిలబెట్టాల్సిన అవసరాన్ని వివరించారు.